www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 25 జనవరి 2023
5
పశ్చిమ గోదావరి



కరెంటు ఛార్జీలు పెంచితే ఉద్యమం

ప్రభుత్వానికి సిపిఎం హెచ్చరిక

వీరవాసరం: ప్రభుత్వం ప్రజలపై కరెంటు ఛార్జీల భారం మోపితే సహించేది లేదని, పెద్దఎత్తున ఉద్యమిస్తామని సిపిఎం మండల కమిటీ హెచ్చరించింది. కమిటీ సమావేశం కేతా జోగిబాబు అధ్యక్షతన మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు జక్కిగ నరసింహామూర్తి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టారిఫ్‌లను మార్చి సర్వీసు ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలతో ప్రజలపై రూ.పది వేల కోట్లు భారం వేసిందని విమర్శించారు. మరోసారి రూ.పదివేల కోట్లు భారం ప్రజలపై వేసేందుకు సిద్ధమైందన్నారు. ఈ భారాన్ని ప్రజలు భరించేందుకు సిద్ధంగా లేరన్నారు. ఇక్కడ ప్రీపెయిడ్ మీటర్లు అమర్చి ప్రతినెలా కరెంటు ఛార్జీలు పెంచే ఆలోచన వెంటనే విరమించుకోవాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగింపు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కన్వీనర్ పి.మృత్యుంజయ, యండమూరి సుబ్బారావు, టి.రాము, నాగలక్ష్మి, బొర్రా ఆలమహారాజు పాల్గొన్నారు.

ఆధునికీకరణ జరిగేనా..!

- డెల్టా ఆధునికీకరణపై కొనసాగుతున్న నిర్లక్ష్యం
- ఇప్పటికీ వేసవిలో చేపట్టబోయే పనులపై స్పష్టత కరువు
- వైసిపి ప్రభుత్వం వచ్చాక పూర్తిగా అటకెక్కిన పనులు
- ఎక్కడికక్కడ పంట కాలువల్లో పూడిక
- ప్రతియేటా వేలాది ఎకరాలు ముంపుబారిన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పంట కాలువల ఆధునికీకరణపై ఈ ఏడాది సందిగ్ధ పరిస్థితి కన్పిస్తోంది. రాబోయే వేసవిలో డెల్టా ఆధునికీకరణకు సంబంధించి చేపట్టబోయే పనులకు సంబంధించి, టెండర్ల ప్రక్రియకు సంబంధించిన స్పష్టత లేదు. ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే ఈ ఏడాది డెల్టా ఆధునికీకరణ పనులపై ప్రభుత్వం చేతులెత్తేసినట్లేనా అనే చర్చ రైతుల్లో నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా డెల్టా పరిధిలో 5.29 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. ఈ సాగు మొత్తానికి గోదావరి నుంచి పంట కాలువల ద్వారా వచ్చే సాగునీరే ఆధారం. 11 ప్రధాన కాలువలు, 300కుపైగా పిల్ల కాలువల ద్వారా సాగునీటి సరఫరా జరుగుతోంది. ఏడాదికి దాదాపు 20 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరుగుతోంది. ఇంత పెద్దఎత్తున పంట పండించేందుకు ఆధారమైన కాలువల ఆధునికీకరణను వైసిపి ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టేసింది. తూడు, గుర్రపుడెక్క, వంటివి తీయడం తప్ప ముఖ్యమైన కాలువల్లో మెరకతీసే పనులు మాత్రం నామమాత్రంగా మారాయి. 2007లో అప్పటి ప్రభుత్వం డెల్టా ఆధునికీకరణ పనుల నిమిత్తం రూ.1464.44 కోట్లు కేటాయించింది. ఇప్పటి వరకూ దాదాపు రూ.800 కోట్లు విలువ చేసే పనులు జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇంకా రూ.600 కోట్ల విలువ చేసే ఆధునికీకరణ పనులు జరగాల్సి ఉంది. 2019లో అప్పుడే వైసిపి ప్రభుత్వం ఏర్పడటంతో ఆధునికీకరణ పనుల ఊసే ప్రస్తావన లేకుండాపోయింది. 2020లో రూ.250 కోట్ల విలువైన పనులకు సంబంధించి జిల్లా ఇరిగేషన్ అధికారులు నివేదికలు తయారు చేసి ప్రభుత్వ అనుమతి కోసం పంపగా స్పందన లేదు.



దీంతో పనులు జరగని పరిస్థితి ఏర్పడింది. 2021లో రూ.300 కోట్ల పనులకు సంబంధించి ప్రతిపాదనలు పంపగా అనుమతి రాలేదు. దీంతో మూడేళ్లు ఆధునికీకరణ పనులు అనేవి ముందుకు సాగిన దాఖలాల్లేవు. జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాల్లో మంత్రులు మాట్లాడుతూ జనవరి నెలాఖరులకల్లా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి కాలువలు మూసివేసిన వెంటనే పనులు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చేస్తుంటారు. అయితే క్షేత్రస్థాయిలో పనులు మాత్రం జరిగిన పరిస్థితి లేదు. ఈ ఏడాదైనా ఆధునికీకరణ పనులు జరుగుతాయా.. లేదా అనే అనుమానాలు నెలకొన్నాయి. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనుండటంతో ఈ సంవత్సరంలో ఆధునికీకరణ పనులు జరగడం కష్టమే.

ప్రతియేటా వేలాది ఎకరాలు ముంపు

డెల్టా ఆధునికీకరణ జరగకపోవడంతో ప్రతియేటా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. చిన్నపాటి వర్షం వస్తే చాలు నారుమడులు, నాట్లు ముంపుబారిన పడుతున్నాయి. దీంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. రబీలో ప్రతియేటా నీటిఎద్దడి సమస్య సతమతమవుతున్నారు. ఖరీఫ్‌లో భారీ వర్షాలు కురిసినప్పుడు పొలాల్లో నీరు కిందకు పారక పంటలు దెబ్బతింటున్నాయి. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా ఆధునికీకరణ గురించి మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ ఏడాదైనా ప్రభుత్వం ఆధునికీకరణ పనులపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

బాలికలు ఆత్మస్థయిర్యంతో ముందుకెళ్లాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆడపిల్లలు ఆత్మస్థయిర్యంతో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అన్నారు. మంగళవారం డిఎన్ఆర్ కళాశాల ఆడిటోరియంలో జాతీయ బాలికా దినోత్సవానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ విచ్చేసి మాట్లాడారు. బాలికలకు, బాలురకు కుటుంబం నుండే సమానత్వం ప్రారంభం కావాలన్నారు. కుటుంబంలో మగ పిల్లవాడిని ఒక విధంగా, ఆడపిల్లను ఒక విధంగా చూస్తారని అలా కాకుండా ఇద్దరినీ సమానంగా చూసే విధంగా తల్లిదండ్రుల్లో, కుటుంబ సభ్యుల్లో మార్పు రావాలని తెలిపారు. సమస్యలను ఎదుర్కోవడానికి ముందుకొచ్చిన ఆడపిల్లలకు అందరూ చేయూతగా నిలవాలన్నారు. ఆడపిల్లలు మంచి చదువు, మంచి ఆలోచన, తెలివి తేటలు ఉండాలని అన్నారు. బాగా చదువుకోవాలని, మంచి ఆహారాన్ని తిని ఆరోగ్యంగా, బలంగా ఉండాలని పేర్కొన్నారు. పలు పరీక్షల్లో టాప్-10లో బాలికలే ఎక్కువగా నిలుస్తున్నారన్నారు. ప్రభుత్వం బాలికలకు అనేక అవకాశాలను కల్పిస్తోందన్నారు. టీనేజ్ బాలికలు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, తమ లక్ష్యాలను సాధించే వరకూ కష్టపడి చదువుకోవాలన్నారు. బాలికా సంరక్షణపై నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.సుజాతా రాణి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డి.మహేశ్వరరావు, డిఇఒ ఆర్.వెంకటరమణ, డిఎన్ఆర్ కాలేజీ ప్రిన్సిపల్ బి.శాంతి కుమారి పాల్గొన్నారు.


గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

శ్మశానవాటికలకు భూమి గుర్తించాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ మురళీ

ప్రజాశక్తి - భీమవరం


శ్మశానవాటికలకు అవస రమైన భూమిని వెంటనే గుర్తించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి.మురళి తహశీల్దార్లను ఆదేశించారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయం నుంచి వివిధ రెవెన్యూ అంశాలపై సంబంధిత అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. భూ సేకరణ నిరంతర ప్రక్రియగా ఉంటుందని, ప్రభుత్వ అవసరాలకు భూమి అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. శ్మశానవాటికలకు అవసరమైన భూమిని తప్పక సేకరించాలని సూచించారు. ఇళ్ల పట్టాలు మంజూరైన వారికి వెంటనే పట్టాలు ప్రింట్ చేసి అందించాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు ముందుకొచ్చేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. ఇళ్ల స్థలాల మంజూరులో కోర్టు కేసులు పరిష్కరించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలను మరింత పారదర్శకంగా ప్రజలకు చేరవేసేందుకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు.


మాట్లాడుతున్న జెసి మురళీ

ఫుట్‌బాల్ పోటీల్లో మోహితపూర్ణ ప్రతిభ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెద తాడేపల్లి భారతీయ విద్యా భవన్స్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పెదతాడేపల్లి జిల్లా పరిషత్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న చిటికెన మోహిత పూర్ణ జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచింది. త్వరలో జరగబోయే జాతీయస్థాయి అండర్-14 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని షేక్ లాల్‌బేబీ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులు కెవిఎస్.రామాంజనేయులు, గ్రామ సర్పంచి పోతుల అన్నవరం, సొసైటీ ఛైర్మన్ పి.తులసీదాస్, ఎస్ఎంసి ఛైర్మన్ బి.వెంకటేశ్వరరావు, గ్రామ ప్రముఖులు, ఉపాధ్యాయులు మోహిత పూర్ణకు అభినందనలు తెలిపారు.


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆంతర్యం... అయోమయం..!

- రాజకీయ వైఖరిపై స్పష్టత లేని బిజెపి నేతల ప్రసంగాలు
- టిడిపి, వైసిపిలను ఓడించాలని పిలుపు
- మాదిగలకు ఏం చేశారని ప్రశ్నించిన ఎంఆర్‌పిఎస్ నేతలు
- భీమవరంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశం

ప్రజాశక్తి - భీమవరం

'వచ్చే సంవత్సరంలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ దశలో జరగనున్న రాష్ట్రస్థాయి సమావేశాల్లో కచ్చితంగా ఆ ఎన్నికలకు సంబంధించిన రాజకీయ వైఖరిపై చర్చించి నేతలు దిశానిర్దేశం చేస్తారు అని ఆశించిన బిజెపి శ్రేణులను మరింత గందరగోళంలోకి నెట్టింది ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం. స్థానిక ఆనంద ఫంక్షన్ హాలులో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు అధ్యక్షత వహించగా కేంద్ర మంత్రులు మురళీధర్, పవర్, బిజెపి జాతీయ కార్యదర్శి సునీల్ ధియోధర్, రాజ్యసభ సభ్యులు సిఎం రమేష్, జివిఎల్.నరసింహారావు, ఎంఎల్‌సిలు పివిఎన్.మాధవ్, నారాయణరెడ్డి, జాతీయ నేత శివప్రకాష్ హాజరయ్యారు. సమావేశంలో ఇప్పటి వరకూ వ్యవహరించిన రాజకీయ వైఖరి, రానున్న రోజుల్లో అవలంబించాల్సిన రాజకీయ వైఖరి గురించి ఎటువంటి చర్చా లేకపోవడం గమనార్హం. గత టిడిపి ప్రభుత్వ పాలనను, ప్రస్తుత వైసిపి ప్రభుత్వ పాలనను విమర్శిస్తూ నేతల ప్రసంగాలు సాగాయి. 2024 ఎన్నికల్లో టిడిపితో పొత్తు ఉంటుందని కొందరు నేతలు చెబుతున్న తరుణంలో అధికార వైసిపితోపాటు టిడిపిపైనా నేతలు ఘాటైన విమర్శలు చేయడం చర్చనీయాంశమైంది. జనసేన గురించి ప్రస్తావించని నేతలు మరి ఆ పార్టీ నేత పవన్‌కళ్యాణ్ ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనీయబోనని చెబుతున్న మాటల ప్రకారం టిడిపితో జతకట్టేందుకు సిద్ధమవుతారా అనే దానిపైనా నోరుమెదప లేదు. మొత్తంగా అధిష్టానం ఆంతర్యం ఏమిటో రాష్ట్ర కార్యవర్గ సమావేశాల సందర్భంగానూ వెల్లడించకపోవడం ఆ పార్టీలో నెలకొన్న సందిగ్ధతకు నిదర్శనమని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.


బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజుకు వినతిపత్రం అందిస్తున్న ఎంఆర్‌పిఎస్ నేతలు

ఎస్‌సి వర్గీకరణ బిల్లు ఏమైంది: ఎంఆర్‌పిఎస్

అధికారం చేపట్టిన వంద రోజుల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లును తీసుకొస్తామని చెప్పిన బిజెపి ఎనిమిదేళ్ల కాలంలో మాదిగలకు ఏం చేసిందని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజును నిలదీశారు. బిల్లును వెంటనే పార్లమెంట్లో పెట్టాలని వారు వీర్రాజుకు వినతిపత్రం అందించారు. కేంద్ర మంత్రి మురళీధరన్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు నేతలు అంగీకరించకపోవడంతో ఎంఆర్‌పిఎస్ నేతలు ఆందోళనకు దిగారు. దీంతో వారు మంత్రిని కలిసేందుకు అనుమతించడంతో ఆయనకూ వినతిపత్రం అందించి సమస్య వివరించారు. కార్యక్రమంలో నాగరాజు మాదిగతోపాటు ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు సురేష్ మాదిగ, ఎంఎస్‌పి జిల్లా సహాయ కార్యదర్శి రాజారావు, ఉమ్మడి జిల్లా కార్యదర్శి చిన్న సుబ్బారావు, రాజారావు పాల్గొన్నారు.

ప్రలోభాలకు తావివ్వకుండా ఓటేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రలోభాలకు తావు ఇవ్వకుండా ఓటు వేయాలని, సమర్థవంతమైన పాలకనకు ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. 13వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయలం రోడ్డులో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత ఓటు హక్కు విషయంలో సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడూ ఓటును బాధ్యతగా స్వీకరించాలని, ఓటు ఒక వజ్రాయుధమని అన్నారు. ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రంగవల్లుల పోటీలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ దాసి రాజు మాట్లాడుతూ 25న విష్ణు కళాశాలలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, గెలుపొందిన వారికి బహుమతులు, సీనియర్ ఓటర్లకు సత్కారం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ రవికుమార్, డిటి గ్రంధి పవన్, చెరుకువాడ రంగసాయి, షిథాల్ భవాని, రంగమణి, అమ్ములారావు, పి.ఏసుబాబు, కంతేటి వెంకటరాజు పాల్గొన్నారు.


ముగ్గులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - మొగల్తూరు

అంగన్వాడీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సిడిపిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని నినదించారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పి.లక్ష్మీమంగతాయారు, పి.సుశీల, టి.శేషకుమారి, పి.నాగలక్ష్మి, ఎ.మంగతాయారు, జి.పెద్దింట్లు, పి.జ్యోతిప్రభ, కె.కుమారి, ఎస్ఎస్.రామసీత, ఎస్.సారమ్మ, టి.కుమారి, పి.లలిత పాల్గొన్నారు.


మొగల్తూరు : ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

పోడూరు: అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రాజెక్ట్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైట్ల రాణి, పీతల రాజమణి కోరారు. మంగళవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. 300 జనాభా దాటిన మినీ సెంటర్‌ను మెయిన్ సెంటర్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకివీడు: ఫేస్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని అంగన్వాడీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద కొద్దిసేపు ధర్నా చేశారు. అనంతరం సూపర్‌వైజర్ మేరీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీల నేత డి.మార్తమ్మ, సిఐటియు మండల అధ్యక్షులు కె.తవిటినాయుడు మాట్లాడగా కార్యదర్శి పెంకి అప్పారావు, అంగన్వాడీల నేతలు రత్నకుమారి, వేగేశ్న పద్మ, ఎస్.రాజకుమారి, జి.శ్యామల, ఎ.రత్నమాణిక్యం, లలిత, జయలక్ష్మి, కాశీరత్నం పాల్గొన్నారు.


పెనుమంట్ర : సిడిపిఒ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ బాలాజీకి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు


ఆకివీడు : సూపర్‌వైజర్ మేరీకి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

పెనుమంట్ర: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి కోడే శ్రీనివాస్ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీల సమస్యలపై అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆదేశాల మేరకు పెనుమంట్ర సిడిపిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిడిపిఒ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌కు బి.బాలాజీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. సభలు, ర్యాలీలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 1ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకురాలు కానూరి తులసి, టి.సాయి మహాలక్ష్మి, సరస్వతి, మౌనిక, సత్యవతి, అమరావతి, శ్యామల, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సమస్యలు లేని గ్రామాలే లక్ష్యంగా తమ ప్రభుత్వం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. యనమదుర్రు గ్రామంలో మంగళవారం నాలుగో రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన తండ్రి బాటలో నడుస్తూ ప్రజలకు సువర్ణపాలన అందిస్తున్నారన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి సంక్షేమంలో తన తండ్రి కంటే రెండు అడుగులు ముందుకేశారన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నాలుగు వంతెనలు నిర్మించామని, వాటికి అప్రోచ్‌ల కోసం రూ.36 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియలో ఉందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి తాగునీరందించేందుకు జల జీవన్ మిషన్ ద్వారా రూ.21 కోట్ల నిధులను మంజూరు చేయగా పనులు కూడా ప్రారంభమయ్యాయన్నారు. యనమదుర్రు గ్రామ అభివృద్ధికి సచివాలయం నిధులు రూ.20 లక్షలు మంజూరు చేయడం జరిగిందని, అలాగే పలు చోట్ల రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు ప్రణాళికా బద్ధంగా చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేగుల నరసింహారావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, తహశీల్దార్ వై.రవికుమార్, సర్పంచి బి.రామ్మూర్తి పాల్గొన్నారు.


భీమవరం రూరల్ : సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎంఎల్ఎ

పెనుగొండ: జగనన్న పాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం 120 రోజు పెనుగొండలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరోసారి జగనన్నను ఆశీర్వదించాలన్నారు. ఆయన వెంట జెడ్‌పిటిసి పి.గోవర్ధన్, ఎంపిటిసి పోతినేడి వెంకటేశ్వరరావు బాపిరెడ్డి, బాలం సత్తిరాజు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలపై రైతుల అభ్యంతరం

తప్పదంటున్న అధికార గణం


ప్రజాశక్తి - వీరవాసరం

ప్రభుత్వ అనుమతులతో మట్టి తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్నా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా దురుసుగా మాట్లాడినా తగిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ మేడిద సుందర్రాజు హెచ్చరించారు. రాయకుదురులో గొంతేరు మురుగు కాలువ నుంచి మట్టి తవ్వకాలపై రైతుల నుంచి అభ్యంతరాలు రావడంతో తహశీల్దార్, ఎస్ఐ, డ్రెయినేజీ శాఖ డిఇ రైతులతో సమావేశమయ్యారు. గొంతేరు మురుగు కాలవలో మట్టి తవ్వకంతో గట్టు బలహీనమవుతుందని రైతులు విజ్ఞప్తి చేశారు. అయితే జగనన్న లేఅవుట్‌ల పూడికకు మట్టి తవ్వకం అవసరమని తహశీల్దార్ అనడంతో వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. కొద్ది రోజులుగా రాయకుదురు వద్ద గొంతేరు మురుగు కాలవ నుండి మట్టి తవ్వి జగనన్న లేఅవుట్ల పూడికకు తరలిస్తున్నారు. దీనిలో భాగంగా గట్టు పైభాగం కొంత, కాలువ బెర్మలులో మట్టి తవ్వుతున్నారు. అయితే రైతుల అభ్యంతరాలతో మట్టి తరలింపు సాగుతుందా, ఆగుతుందా అనేది వేచిచూడాలి.


రాయకుదురులో వాదులాడుకుంటున్న రైతులు, తహశీల్దార్

ఇదిలా ఉంటే వీరవాసరం మండలంలో జగనన్న లేఅవుట్‌లు ఇంకా పూడిక చేయాల్సి ఉంది. ఇప్పటికే కొన్ని లేఅవుట్‌లకు మట్టిని కొనుగోలు చేసి పూడిక చేశారు. మరికొన్ని లేఅవుట్‌లు పూడిక చేయాల్సి ఉంది. భవిష్యత్‌లో ఇక్కడ మట్టి కొరత ఏర్పడే అవకాశం ఉంది. అటువంటి పరిస్థితుల్లో ఇక్కడ మట్టిని వేరే ప్రాంతాలకు అధికారులు ఏ విధంగా తరలిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఇదే విధంగా మత్స్యపురి నుండి భీమవరం, పాలకొల్లు ప్రాంతాలకు మట్టిని తరలించారు. పాలకోడేరు మండలంలో ప్రయివేటు లేఅవుట్‌లకు దొరుకుతున్న మట్టి ప్రభుత్వ లేఅవుట్‌లకు ఎందుకు దొరకడం లేదో అధికారులు చెప్పాలని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పాలకొల్లు అబ్బాయి.. అమెరికా అమ్మాయి
ఒక్కటైన జంట.. పాలకొల్లులో విందు


పాలకొల్లుకు చెందిన రాకేష్‌తో అమెరికా అమ్మాయి డేనియల్‌తో జరిగిన వివాహం

ప్రజాశక్తి - పాలకొల్లు
పాలకొల్లు అబ్బాయి.. అమెరికా అమ్మాయిల మధ్య చిగురించిన ప్రేమ వివాహ బంధంగా మారింది. పాలకొల్లు 31వ వార్డుకు చెందిన నల్లి పెద్దిరాజు, సుధారాణి దంపతుల కుమారుడు రాకేష్ అమెరికాలోని వర్జీనియాలో తల్లిదండ్రులతో ఉంటున్నారు. రాకేష్ అమెరికాలో ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడ డేనియల్‌తో స్నేహం ప్రేమగా మారింది. గత ఏడాది జులైలో వారికి వర్జీనియాలో వివాహం జరిగింది. ఇటీవల ఇండియాకు తల్లిదండ్రులతో వచ్చిన రాకేష్ సోమవారం రాత్రి తన నివాసంలో బంధుమిత్రులకు విందు ఇచ్చారు. 2011లో తల్లిదండ్రులతో పాటు వర్జీనియా వెళ్ళి అక్కడే చదువు పూర్తి చేసుకుని అమెరికా ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నాడు.

తానా ఈ-సంకలనంలో 'రంగరాజు' కార్టూన్

ప్రజాశక్తి - ఉండి
తెలుగు భాష - సంస్కృతిపై ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్టూన్ల పోటీ నిర్వహించింది. పోటీకి వచ్చిన కార్టూన్లలో అత్యుత్తమంగా ఉన్న కార్టూన్లతో ఈ - సంకలనం వేసింది. ఈ ప్రతిష్టాత్మక సంకలనంలో పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం చెరుకువాడకు చెందిన ప్రముఖ కార్టూనిస్ట్ గాదిరాజు రంగరాజు గీసిన వ్యంగ్య చిత్రానికి చోటు లభించిందని ఆయన మంగళవారం తెలిపారు. తాను మూడు కార్టూన్లు పంపించానని దానిలో ఒకటి ఎంపికైందని తెలిపారు. ఆదివారం రాత్రి విజయవాడలోని సర్వోత్తమ గ్రంథాలయంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎం.దుర్గాప్రసాద్ ఈ కార్టూన్ల పుస్తకాన్ని ఆవిష్కరించారు. తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు తోటకూర ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ పూర్వ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగరాజును పలువురు అభినందించారు.

ఉత్తమ పరిశోధనా కేంద్రంగా మార్టేరు

ప్రజాశక్తి - పెనుమంట్ర
ఉత్తమ పరిశోధనా కేంద్రంగా మార్టేరుకు అవార్డు రావడం పట్ల వ్యవసాయ పరిశోధన సంస్థ ఎడిఆర్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలోని రాహూరిలో మహాత్మా ఫూలే కృషి విశ్వవిద్యాలయంలో గత శనివారం జరిగిన అఖిల భారత సమన్వయ సంయుక్త సమీక్షా వ్యవసాయ విధాన క్షేత్రాల సదస్సులో మార్టేరు ప్రధాన శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ ఐసిఎఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్‌కె.చౌదరి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఎడిఆర్ భరతలక్ష్మి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏడెక్షన్ శ్రీనివాస్ బృందం సమీక్షిత వ్యవసాయ విధానాలపై విస్తృత పరిశోధన చేసి రైతాంగానికి అనువైన చిన్న, సన్నకారు రైతులకు ఆచరణ యోగ్యంగా ఉన్న నమూనాలను అందించారన్నారు. దీనికి గాను ఉత్తమ పరిశోధనా కేంద్రం అవార్డు లభించిందని తెలిపారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి సుమారు 38 పరిశోధన సంస్థలు పోటీ చేశాయన్నారు. ఈ పోటీలో తమ సంస్థకు స్థానం దక్కిందని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - ఆచంట
ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆచంట సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆచంట పంచాయతీ పరిధి బాలవారిపేట, కసరత్తులకు, ఆచంట పెద్దపేట, చిన్నపేటలో పారిశుద్య కార్మికులతో దోమల మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవన్నారు. ఆచంటను సంపూర్ణ పారిశుద్య గ్రామంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్తవేయొద్దని తెలిపారు.

గ్రామాలాభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి
ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్
గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని, అధికారులు పూర్తిస్థాయిలో ప్రజా ప్రతినిధులను కలుపుకుని వెళ్లాలని ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి విజయ నరసింహరాజు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఎంఎల్ఏ గ్రంధి శ్రీనివాస్ అభివృద్ధి పరంగా భీమవరం నియోజకవర్గాన్ని రాష్ట్రస్థాయిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు శక్తి వంచన లేకుండా పనిచేస్తున్నారన్నారు. మండలంలో పనిచేస్తున్న అధికారులు అభివృద్ధి పనుల్లో పూర్తిస్థాయిలో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనకు రూ.36 కోట్ల నిధులతో అప్రోచ్ రోడ్లను నిర్మించే దిశగా ఎంఎల్ఏ గ్రంధి శ్రీనివాస్ నిధులను మంజూరు చేయించారన్నారు. త్వరలోనే బెండర్ ప్రక్రియ జరుగుతుందన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఎఫ్‌డిఒను ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేగుల నరసింహారావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రామచంద్ర ప్రభు, ఎంపిటిసీలు పాల్గొన్నారు.

గోవుల పెంపకం అభినందనీయం : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం రూరల్
నిర్వాహకులు పశ్ల ఏనుబాబు సుమారు 100 గోవులను పోషించడం గొప్ప విషయమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అభినందించారు. పర్యాటక థియేటర్ రోడ్డులోని శ్రీ విజయలక్ష్మి గోశాలను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పుంగనూరు ఆవుదూడను ఎత్తుకుని ముద్దాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వివిధ జాతులకు చెందిన సుమారు 100 గోవులను పెంచడం అభినందనీయమని, ఏనుబాబు మరికొందరికి మార్గదర్శకమని తెలిపారు. అనంతరం ఏనుబాబును సత్కరించారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, లయన్స్ క్లబ్ పట్టణ కార్యదర్శి నరహరిశెట్టి కృష్ణ, కంతేటి వెంకటరాజు, ఆర్‌డిఒ దాసి రాజు పాల్గొన్నారు.

రిక్షా కార్మికుడు ఆత్మహత్య

నేరాలు.. ఘోరాలు..

ప్రజాశక్తి - పాలకొల్లు
ఆర్థిక ఇబ్బందుల కారణంగా పాలకొల్లు దాసరి నారాయణరావు వంతెనకు ఉరి వేసుకొని రిక్షా కార్మికుడు నమ్మి శ్రీనివాసరావు (48) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. అతని భార్య ఏడాదిన్నర కిందట మృతి చెందింది. శ్రీనివాసరావుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారికి ఇంకా వివాహం కాలేదు. రిక్షా లాగుతూ జీవనం సాగిస్తున్న శ్రీనివాసరావుకు ఆదాయం లేకపోవడం, అప్పుల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఎస్ఐ బి.శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూల్ డ్రింక్ షాపులో చోరీ
ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - వీరవాసరం
వీరవాసరంలోని ఓ కూల్ డ్రింక్ షాపులో చోరీకి పాల్పడిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. వీరవాసరంలోని శ్రీరామ కూల్ డ్రింక్ షాపులో ఈ నెల 23 తేదీ రాత్రి చోరీ జరిగింది. ఈ చోరీలో రూ.ఐదు వేల నగదుతో పాటు రూ.ఇరవై వేల విలువైన సిగరెట్లు, సిగార్ లైట్లు దుండగులు అపహరించారు. దీనిపై షాపు యజమాని గూడూరి లీలారమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. షాపులోని సీసీ కెమెరాల ఆధారంగా వీరవాసరానికి చెందిన డానియేల్ సుందర్, గొల్లమందల జోష్ నేరానికి పాల్పడినట్లు గుర్తించారు. వారిని మంగళవారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కలెక్టర్ ప్రశాంతికి బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డు



ప్రజాశక్తి - భీమవరం
జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతికి రాష్ట్రస్థాయి బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డు లభించింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ రాష్ట్రస్థాయి బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డుకు ఎంపిక చేసినట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డును 13వ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 25న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అందజేయనున్నారు. ఓటరు చైతన్య కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసినందుకు, అత్యధిక ఓటర్ల నమోదు చేసినందుకు గాను రాష్ట్రంలో ఎంపిక చేసిన ముగ్గురు కలెక్టర్లలో జిల్లా కలెక్టర్ ప్రశాంతికి ఈ అవార్డు లభించింది. జిల్లా కలెక్టర్‌కు అవార్డు లభించడం పట్ల అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్ఎఫ్ఐ నేత భగవాన్ మృతి

ప్రజాశక్తి - ఆకివీడు
ఎస్ఎఫ్ఐ నాయకుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యన భగవాన్ (18) శుక్రవారం మృతి చెందారు. భగవాన్ గత కొంతకాలంగా అనారోగ్యంతో విజయవాడ ఆంధ్రా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం మరింత విషమించి మంగళవారం సాయంత్రం చనిపోయినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బి.రాంబాబు తెలిపారు. మండలంలోని దుంపగడప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ మొదటి సంవత్సరం చదువుతున్న ఆయన స్వగ్రామం పెదకాపవరం.


భగవాన్ (ఫైల్‌ఫోటో)

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పెనుగొండ
విఆర్ఎల్‌పై ఒత్తిడి చేసి పనులు చేయించడం తగదని విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షులు వి.గణేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విఆర్ఎలు ఫేస్ బయోమెట్రిక్ హాజరు వేయకపోతే జీతాలు రావని అధికారులు భయ పెడుతున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పుష్పరాజుకు బెస్ట్ సోషల్ వర్కర్ జాతీయ అవార్డు


నన్నేటి పుష్పరాజు

ప్రజాశక్తి - ఆచంట
మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజు 2023 గాను బెస్ట్ సోషల్ వర్కర్ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డును ఈ నెల 26వ తేదీన విశాఖపట్నం ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వద్ద చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు, సంస్థ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు దోమన చిన్నారావు ప్రదానం చేయనున్నారు. వేమవరం గ్రామానికి చెందిన నన్నేటి పుష్పరాజ్ చేసిన ఎనలేని సేవలకు గాను ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయనకు అవార్డు రావడంపై మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు గుండె సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోలాటి ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి చిల్లి రాజ్‌కుమార్, యువజన విభాగం అధ్యక్షులు పిట్టా వినోద్ కుమార్, భీమవరం పట్టణ అధ్యక్షులు గొల్ల గోపి, భీమవరం మండల అధ్యక్షులు దాసరి చిరంజీవి, ఉండి మండల అధ్యక్షులు చిరుపాటి రాజేష్, భీమవరం మండల కార్యదర్శి నన్నేటి నాగరాజు, పట్టణ కార్యదర్శి నేలల సాల్మన్ రాజు, ఆచంట మండల కార్యదర్శి సాక బాబు రాజేంద్రప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

మే 14న దళిత గర్జనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - కాళ్ల
ఏలూరులో మే 14న జరిగే దళిత గర్జనను విజయవంతం చేయాలని మాల మహాసేన జాతీయ అధ్యక్షులు అలగ రవికుమార్ పిలుపునిచ్చారు. సీసలిలో జిల్లా మాల మహాసేన కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి మాల మహాసేన జాతీయ అధ్యక్షులు అలగ రవికుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ దళితుల పక్షాన పోరాటానికి ఎప్పుడు ముందుంటామన్నారు. రాబోయే రోజుల్లో దళిత సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు మే 14న ఏలూరులో దళిత గర్జన లక్ష మందితో నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నామన్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున దళితులు తరలిరావాలని పిలుపునిచ్చారు. దళిత గర్జనను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త, యువత తమ వంతు కృషి చేయాలని కోరారు. అనంతరం మాల మహాసేన నూతన కమిటీని నియమించారు. రాష్ట్ర కార్యదర్శిగా మర్రి కృపాదానం, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులుగా గొల్ల ఆశీర్వాదం, భీమవరం, ఉండి, కాళ్ల మండల కమిటీలను నియమించారు. అలాగే దళిత గర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మాల మహాసేన ప్రధాన కార్యదర్శి పల్లెం ఏడుకొండలు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రాజ్ కుమార్, మాల మహాసేన నాయకులు కొవ్వాడ రాజారావు, సరెళ్ల వినోద్ కుమార్, కరిరి పృధ్వీరాజ్ పాల్గొన్నారు.

బాలికలు హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం


తాడేపల్లిగూడెం : బాలికా దినోత్సవం సందర్భంగా ముగ్గువేసిన విద్యార్థినులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం
సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల తదితర అంశాలపై అవగాహనుండాలని డైమండ్స్ లయన్స్ క్లబ్ డైరెక్టర్ లయన్ రమ్య సాయి ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక గరల్స్ హైస్కూల్లో డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డివైఇఒ రవీంద్ర భారతి మాట్లాడారు. జాతీయ బాలికా దినోత్సవం ఏటా జనవరి 24న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలికల హక్కులు, లక్ష్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఇన్‌ఛార్జి రామకృష్ణ, ఇంద్రవాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రోహిణి, అంజనా దేవి, సునీత, రత్నకుమారి, వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

ఉండి : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని బేబీ రాణి అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ డి.అనిల్ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బేబీ రాణి మాట్లాడుతూ కిశోర బాలికలు హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ 18 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహానికి సిద్ధం కావాలని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కిశోర బాలికలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు వీవర్స్ కాలనీ అర్బన్ పిహెచ్‌సి పరిధిలోని ఐసిడిఎస్ పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ జాన్ లియో మాట్లాడుతూ బాలికలకు బాలురతో సమానంగా చదువు, ఆరోగ్యం, పౌష్టికాహారం పొందడం, ఆ కార్యక్రమం కల్పించిన హక్కు అన్నారు. ఈ కార్యక్రమంలో నిట్టల తెలజ, హెచ్ఎం.భవాని ప్రసాద్, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, 4, 5 సచివాలయ మహిళా పోలీస్ సంయుక్తంగా కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శోభారాణి మాట్లాడారు. బాలికల హక్కులు, ఆరోగ్యం, విద్య విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు జ్యోతి, నాగ మోహిని, శ్రీదేవి పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 27 మంది ఎంపిక
ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, కళాశాల జెసిసి కలిసి నిర్వహించిన జాబ్‌మేళాలో 70 మంది పాల్గొనగా 27 మంది ఎంపికయ్యారని వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్ తెలిపారు. ఎపి ఎస్ఎస్‌డిసి జిల్లా మేనేజర్ ఎ.రెడ్డి, శిరీష, మురళీకృష్ణ, కంపెనీ హెచ్‌ఆర్‌లు పాల్గొన్నారు.

భీమవరం రూరల్: సమాజంలో పురుషులు, మహిళలు సమానం అనే భావన కుటుంబ వ్యవస్థలో పెంపొందే విధంగా యువత కృషి చేయాలని పలువురు ప్రముఖులు తెలిపారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ గర్ల్ చైల్డ్ డే కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ఉమెన్ అండ్ ఎంపవర్‌మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.భువనేశ్వరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విజయవాడ వాసవి మహిళా సంఘం అధ్యక్షురాలు డాక్టర్ కీర్తి అలెక్జాలే మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వాతంత్ర్య భారతదేశంలో మహిళలపై ఇంకా దాడులు జరగడం అన్యాయం అన్నారు. వాటిని నివారించడంలో ప్రభుత్వాలే కాకుండా మహిళలు ఉన్నత విద్యావంతులై సమాజంలో మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలే ఉన్నత స్థానాల్లో వెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఇన్‌ఛార్జి బిహెచ్‌వి ఎన్.లక్ష్మి, మహిళా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొగల్తూరు : ఆడపిల్ల ఇంటికి వెలుగని ఐసిడిఎస్ సిడిపిఒ ఉర్మిళ అన్నారు. మొగల్తూరులోని ఐసిడిఎస్ కార్యాలయంలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, ఎంపిడిఒ ఆర్‌సి ఆనంద్ కుమార్, తహశీల్దార్ అనిత కుమారి పాల్గొన్నారు.

పెనుగొండ : మండలంలోని ఎస్‌వికెపి బాలికల హైస్కూల్ హెచ్ఎం ఇందుకూరి పద్మావతి అధ్యక్షతన సిబిటియు ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం పద్మావతి, ఐసిడిఎస్ విజయకుమారి మాట్లాడుతూ బాలికలు అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళా పోలీస్ మాట్లాడుతూ బాలికల హక్కులను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తణుకురూరల్ : విద్యార్థి దశలోనే ఉన్నతమైన ఆలోచనలతో మంచి మార్గాన్ని ఏర్పాటు చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని యుపిహెచ్‌సి పృథ్వీరాజ్ అన్నారు. మంగళవారం ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవం కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లింగనిర్ధారణ పరీక్షలు చట్ట ప్రకారం నేరమన్నారు. ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల పరిపాలనాధికారి డి.సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ యు.లక్ష్మీసుందరీబాయి, జి.రమ్య, సిహెచ్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

యలమంచిలి : చించినాడ హైస్కూల్లో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ సిహెచ్ త్రిపుర పాణి హాజరయ్యారు. అనంతరం జరిగిన సభలో గ్రామ సర్పంచి గంగోటి రాజమణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రాజు, మహిళా సంరక్షణ కార్యదర్శి ఎస్ దీప్తి, ఎఎన్ఎం కనకదుర్గ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : స్థానిక శశి ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా సాధికారత కమిటీ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మొహమ్మద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ బాలికలను, వారి హక్కులను కాపాడాలన్నారు. బాలికల చైతన్యాన్ని చాటుతూ వేసిన రంగవల్లులు అందరినీ ఆకర్షించాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, డైరెక్టర్ కె.భానుప్రసాద్, డీన్ స్టూడెంట్ అఫైర్స్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


పెనుగొండ : మాట్లాడుతున్న హెచ్ఎం పద్మావతి

రోడ్డు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ఉండి
ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఉండి కోట్ల ఫంక్షన్ హాల్‌లో భీమవరం డిఎస్‌పి శ్రీనాథ్ భీమవరం రూరల్ సర్కిల్, ఆకివీడు సర్కిల్ పరిధిలోని లారీ, ఆటో డ్రైవర్లతో ట్రాఫిక్ నియంత్రణపై, ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 20 సంవత్సరాల్లోపు యువకులే రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమవరం రూరల్ సిఐ నాగప్రసాద్, ఆకివీడు రూరల్ సిఐ గీతా రామకృష్ణ, ఎస్ఐలు పాల్గొన్నారు.

జనసేనలోకి 30 మంది చేరిక

భీమవరం రూరల్: మండలంలోని నాగిడిపాలెంకు చెందిన వైసిపి నాయకులు తిరుమాని ముత్యాలరాజు, టిడిపి నుంచి నాగిడి హరికృష్ణ ఆధ్వర్యంలో 30 మంది జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు సమక్షంలో మంగళవారం జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో జనసేన మరింత బలం పుంజుకుని ఎన్నికల్లో సత్తా చాటుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమల్ల చంద్రశేఖర్, మండల అధ్యక్షులు మోకా శ్రీను, పట్టణ కార్యదర్శి సంకర రవీంద్రనాథ్ రాఘూర్ పాల్గొన్నారు.

జనసేన గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఆకివీడు
జనసేన గ్రామ కమిటీ ఎన్నిక మంగళవారం అజ్జమూరులో జరిగింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం మండల కమిటీ అధ్యక్షులు కొటికలపూడి వెంకటలక్ష్మ తాతాజీ, ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు హాజరయ్యారు. గ్రామ అధ్యక్షులుగా రాట్నాల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా నూరు వెంకటేశ్వరరావు, భీమా భీమేషు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా సాంబ్రాణి బాపూజీ, సాంగ్ మిల్లి సింహాద్రి నాయుడు, కాగితాల ప్రసాద్, ఆవుల శ్రీనివాసరావు, మరో 14 మంది కార్యదర్శులతో కూడిన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నాగరాజు ప్రకటించారు.

వచ్చే నెలలో 'వైఎస్ఆర్ చేదోడు' అందజేత

ప్రజాశక్తి - భీమవరం
వచ్చే నెలలో వైఎస్ఆర్ చేదోడు పథకం కింద 3వ విడత సాయం అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పథకం కింద దర్జీలు, రజకులు, నాయీ బ్రాహ్మణులకు ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున ప్రభుత్వం అందించనుందని తెలిపారు. సాయాన్ని పొందే లబ్ధిదారుల నుంచి ఇప్పటికే దరఖాస్తులు సచివాలయ సిబ్బంది ఆహ్వానించారు. లబ్ధిదారులు నిర్దేశిత వృత్తిపనే పూర్తిగా ఆధారపడి జీవిస్తున్నారా, పాక్షికంగా ఆధారపడి ఉన్నారా తదితర వివరాలను సేకరించాలని పేర్కొన్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - మొగల్తూరు
గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలందించే ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ దినేష్ కుమార్ కోరారు. ముత్యాలపల్లిలో మంగళవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 70 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుబ్బారావు, సిబ్బంది హనుమంతరావు, సిహెచ్.తులసమ్మ, బంగారమ్మ, విజయలక్ష్మి, ప్రభాకర్, రమేష్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

నా క్షయింట్ పువుర్ల శ్రీరామ నాగ సత్యనారాయణ వరప్రసాద్ దస్తావేజు అనగా ఆయన ది. 12-02-1986వ తేదీన మొగల్తూరు సబ్‌ రిజిస్ట్రార్ నరసింహారావు గార్డియన్‌గా ఉండి మొగల్తూరు వెంకటావు తరుపున నా క్షయింట్‌కు రిజిస్ట్రర్ చేయించి యిచ్చిన క్రయ దస్తావేజు ఒరిజినల్ ఆయన ది. 02-01-2023వ తేదీన తన ఇంటి వద్ద ఉండి జిరాక్స్ తీయుకొని నిమిత్తం పోస్టాఫ్ కాలనీ నుండి సత్యవాడ పెళ్ళుచుండగా మార్గ మధ్యములో ఎక్కడో పోయినది. దీనికొరకు వారికి తెలిపి పరిశోధకం చేయించినా ఆచూకీ లభించలేదు. కావున తమకు ఇవ్వబడునని తెలియజేయటమైనది.
నెక్కరగంటి నరసింహారావు, అడ్వకేట్
రోడ్డు నెం.2, ప్లాట్ నెం.21
మోతేవారి తోట, అశోక్‌నగర్, ఏలూరు
ఏలూరు జిల్లా, సెల్: 9848118984

డాక్యుమెంట్ పోయినది

ఏలూరు జిల్లా, నిడమర్రు మండలం, నిడమర్రు గ్రామ కాపురస్తులైన కంచం శ్రీనివాసరావు, S/o. రాంబాబు అను నాకు SRO, గణపవరంలో డాక్యుమెంట్ నెంబర్స్ 1) 4457/2005, 2) 8558/2011, 3) 4930/2012 అను డాక్యుమెంట్స్ ఉన్న కవరు మార్గమధ్యలో పడిపోయినది. మళ్ళీ ఎంత వెతికిన కవరు దొరకలేదు. కావున ఈ దస్తావేజులు (అస్లీ ప్రతులు) దొరికినవారు ఈక్రింది ఫోన్ నెంబర్‌కు తెలియజేయవలసిందిగా కోరుచున్నాను.
కంచం శ్రీనివాసరావు
తండ్రి: రాంబాబు,
నిడమర్రు, ఏలూరు జిల్లా
సెల్: 9666387777

జగనన్న లేఅవుట్ల పరిశీలన

ప్రజాశక్తి - పాలకొల్లు
గ్రామ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల లేఅవుట్లను మున్సిపల్ కమిషనర్ బిఆర్ఎస్ శేషాద్రి మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మేడపాడు, కొంతేరు లేఅవుట్లను పట్టణ ప్రణాళిక అధికారి కె.వీరబ్రహ్మం, హౌసింగ్ సిబ్బందితో కలిసి సందర్శించారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేపట్టి, వాటిని ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు.

అన్నా క్యాంటీన్ వద్ద అన్నదానం

ప్రజాశక్తి - పాలకొల్లు
పేదల ఆకలి తీర్చడమే అన్నా క్యాంటీన్ ఉద్దేశమని ఎంఎల్ఏ నిమ్మల రామానాయుడు చెప్పారు. 765వ రోజు మంగళవారం అన్నా క్యాంటీన్ వద్ద, పాత బస్టాండ్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మొబైల్ అన్నా క్యాంటీన్లో పేదలకు ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడారు.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, గణపవరం మండలం, గణపవరం గ్రామ కాపురస్తులయిన బలె వెంకటేశ్వర్రమ్మ, భర్త: వెంకన్న అను నేను నాయొక్క పాస్‌పోర్టు గణపవరం సెంటర్‌లో జిరాక్స్ తీయించుకొని వస్తుండగా దారిలో పాస్‌పోర్టు ఉన్న కవరు ఎక్కడో పడిపోయినది. నాయొక్క పాస్‌పోర్టు నెంబర్ **S5315837.** కావున పాస్‌పోర్టు దొరికినవారు ఈక్రింది గల ఫోన్ నెంబర్‌కు **7095519327** తెలియజేయవలసిందిగా కోరుచున్నాను.
బలె వెంకటేశ్వర్రమ్మ
భర్త: వెంకన్న
గణపవరం (V), (MD)
ఏలూరు జిల్లా, సెల్: 7095519327

IN THE COURT OF THE 1ST ADDL. JUNIOR CIVIL JUDGE :: TANUKU
O.S.NO.308/2022

Between:
Thota Dhanalakshmi ...*Plaintiff*
V/s
1) Kumpatla Dharmarao and others ...*Defendants*

వాది తరుపున చేసిన ప్రకటన
3వ ప్రతివాది:
ఘంటా లీలా మనోహర్, తండ్రి: నాగ వెంకట రామకృష్ణ, డో.నెం.1-62, హిందువు, పురుషుడు, కతపపాడు, జగగవరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.
పై నెంబరు దావా గ్రంథంలో 3వ ప్రతివాది అయిన మీరు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిన మీకు అమలు జరగనందున శ్రీకోర్టు వారి ఆదేశము ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియచేయడమైనది ఏమనగా మీరు **ది.16-02-2023వ తారీఖున ఉదయం 10:30 గం॥లకు మీరు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకు ఆక్షేపణలు తెలియచేసి కోవలసినదిగాను,** అట్లుకాని ఎడల మీపై పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.
GANISETTI SURYA CHANDRARAO
ADVOCATE, TANUKU

In The Court Of The Hon'ble VII Additional District Judge-cum-Family Court :: Eluru :: W.G.Dist
F.C.O.P.No. 147/2022

Between:
Smt. Pandiripalli Annapurna Durga Devi ...*Petitioner*
AND
Sri. Pandiripalli Sriranga Nukaraju ...*Respondent*

పై నెంబరు పిటీషనులో రెస్పాండెంటు అయిన Sri. Pandiripalli Sriranga Nukaraju, S/o. Lakshminarayana Babu, Hindu, Male, aged 54 years, R/o. D.No. 23A-3-49, RMS Colony, Opp. Park, R.R.Peta, Eluru,Eluru Dist. Cell: 91331 90044 అను మీకు చాలాసార్లు నోటీసులు కోర్టు నుండి అమలు నిమిత్తం పంపినప్పటికీని అమలు కాలేదు. కావున సదరు కేసు **ది.15-02-2023 నాటికి వాయిదా అయియున్నది. ఆ వాయిదా రోజు మీరు ఉదయం గం॥ 10:00 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకోవలెను.** లేని ఎడల పై కోర్టు వారు మీ పరోక్షమందు సదరు కేసు తీర్మానించెదరు. కావున మీకు తెలియపర్చటమైనది.
(డి.04-01-2023వ తేదీ నాటి శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కె.వి.పి.మాధవరావు
అడ్వకేట్ & నోటరీ,
అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్,
ఏలూరు కోర్టు సెంటర్,
సెల్: 94401 11033

వేలం ప్రకటన
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, నూజివీడులో
ఇ.పి. 37/2018 ఇన్ ఒ.యస్. 484/2015

డిక్రీదార్:
వానా శ్యామలాంబ అనే శ్యామల -డి.హెచ్.ఆర్ మరియ
నీలపాల సత్యవతి -జే.డి.ఆర్

కృష్ణా జిల్లా, నూజివీడు సబ్ రిజిస్ట్రార్ వారి యిలాకా, ముసునూరు మండలం, గోపవరం పంచాయితీ, ముసునూరు మండలం, గోపవరం గ్రామ ఆర్.ఎస్. నెం. 305/6 దాఖలా యం. 0-07 1/2 సెంట్లు లేక 363 చ॥గజముల నిర్వేశన స్థలం మరియు సదరు స్థలంలో నిర్మించబడియున్న డోర్ నెం. 1-25 దాఖలా ఆర్.సి.సి. డాబా ఇల్లు, సదరు ఇంటికి అమర్చబడిన యావత్ పరికరములతో సహా పై తెలిపిన జే.డి.ఆర్. యొక్క సంపూర్ణ స్వార్జిత హక్కు భుక్తములలో ఉన్నది ఈ డిక్రీ బాకీ క్రింద ఇవ్వు ధార్థ్ కాబడి, వేలం కావలసియున్న ఆస్తికి హద్దులు.
తూర్పు: 5 గజముల నడకదారి.
దక్షిణం: సత్యిబోయిన నాగేశ్వరమ్మ గారి స్థలం.
పడమర: సాయిల చిట్టెమ్మ గారి స్థలం.
ఉత్తరం: 4 గజముల నడకదారి.
డి.హెచ్.ఆర్. విలువ: రూ. 10,00,000/-
అఫీసా విలువ: రూ. 15,00,000/-
పైన తెలిపిన ఆస్తిని శ్రీ కోర్టు వారు ది. 10-02-2023 తేదీన ఉదయం 10.30 ని॥లకు బహిరంగ వేలం వేయుదురు. కావున కావాల్సినవారు పాడుకొనవచ్చును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
యమ్.రమేష్
డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాది
నూజివీడు, సెల్:9440257635